క్లుప్తంగా

నీతి కథలతో ఉన్నత భావాలు


కథలు చదువుతున్న విద్యార్థులు

మురళీనగర్: విద్యార్థులు నీతి కథలు చదవడం వల్ల ఉన్నత భావాలు ఏర్పడతాయని గ్రంథాలయ ఉద్యమకర్త దత్తి అప్పలనాయుడు అన్నారు. మురళీనగర్ శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా మంగళవారం నీతి కథల పఠన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పెద్దల పట్ల గౌరవం, జీవితాన్ని క్రమశిక్షణతో గడపడం అలవాటు చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కథల పుస్తకాలు చదివించారు. కథలు చెప్పించి, కథలు చదివించారు. లైబ్రేరియన్ వై.పద్మజ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో టీచర్ విజయలక్ష్మి పాల్గొని విద్యార్థులకు కథలు చెప్పారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ


లబ్ధిదారులతో ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు


సీతమ్మధార: ప్రభుత్వ పథకాలు, రుణాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ శాసనసభా పక్ష నేత, ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు కోరారు. మంగళవారం తన కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి లబ్ధిదారులకు ఆయన చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి రూ.9 లక్షలు చెక్కుల రూపంలో లబ్ధిదారులకు అందజేసినట్లు తెలిపారు. నియోజక వర్గ ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటానని, సమస్యలుంటే తనను నేరుగా కలవొచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో 45వ వార్డు కార్పొరేటర్ హనూక్, ఉత్తర నియోజక వర్గ టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండీ నజీర్, సురేష్ బాబు, టీడీపీ, బీజేపీ, జనసేన వార్డు అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

సత్యకుమారికి నారీశక్తి అవార్డు


నారీశక్తి అవార్డు అందుకుంటున్న సత్యకుమారి

సీతంపేట: నగరానికి చెందిన సామాజిక సేవకురాలు డబ్ల్యూ.సత్యకుమారికి ప్రతిష్టాత్మకమైన నారీశక్తి అవార్డు లభించింది. ప్రజలు, విద్యార్థులకు సత్యకుమారి చేస్తున్న సేవను గుర్తించిన న్యూఢిల్లీకి చెందిన దూత్రా దర్శక్ ఫౌండేషన్ ఈ అవార్డుకు ఎంపిక చేసింది. ఉమెన్ లీడర్ ఆఫ్ ది ఇయర్ కేటగిరీలో అవార్డును ప్రకటించారు. ప్రముఖ నటి సుధా చంద్రన్, మిసెస్ ఇండియా మంజరి చేతుల మీదుగా అవార్డు స్వీకరించారు. సత్య కుమారి 14 ఏళ్లుగా నగరంలో బీపీవోగా విధులు నిర్వర్తిస్తూ, విధి నిర్వహణ, కుటుంబ బాధ్యతలు చూసుకుంటూ, నగరంలో పలు ప్రాంతాలలో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వర్తిస్తున్నారు. సమాజంలో మహిళా ప్రాధాన్యత, ఆర్థికాభివృద్ధి వంటి అంశాలపై పాఠశాల, కళాశాల స్థాయి నుంచి విద్యార్థులకు విస్తృత అవగాహన కల్పిస్తున్నారు. అదే విధంగా విద్యార్థులకు ఫిజికల్ ఫిట్‌నెస్, మెంటల్ అవేర్‌నెస్‌పై కూడా శిక్షణ అందిస్తున్నారు. ప్రతిష్టాత్మక నారీశక్తి అవార్డును అందుకున్న సత్యకుమారికి కుటుంబ సభ్యులు,స్నేహితులు అభినందనలు తెలిపారు.

ఎండ వేడికి ప్రజలు విలవిల


నిర్మానుష్యంగా దర్శనమిస్తున్న బాలయ్యశాస్త్రి లేఅవుట్

సీతమ్మధార: భానుడి భగభగలకు ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ఇళ్ల నుంచి బయటికి రావాలంటే భయపడి పనులు వాయిదా వేసుకుంటున్నారు. అత్యవసర సమయంలో రోడ్లపైకి వచ్చే వారు తప్పనిసరిగా గొడుగులు, తాగునీరు వెంట తీసుకెళ్లాలని వైద్యులు చెబుతున్నారు. ఉదయం 10లోపు సాయంత్రం 3 తర్వాత మాత్రమే బయటికి వెళ్లాలని సూచిస్తున్నారు. ఈ నేపథ్యంలో సీతమ్మధారలోని బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లో రహదారులు నిర్మానుష్యంగా మారాయి.

మద్యంపై మహిళల పోరు


ధర్మానగర్‌లో ర్యాలీ చేస్తున్న కాలనీ వాసులు


ధర్మానగర్‌లో మద్యం దుకాణం వద్ద స్థానికులకు కంటితుడుపుగా నిరసన చేపట్టిన కూటమి నాయకులు

- మద్యం దుకాణాలు వద్దంటూ పోరుబాట పట్టిన మహిళలు
- కొండవాలు, మురికివాడల్లో వైన్ షాపుల ఏర్పాటు
- నిరసనలు, ధర్నాలు, ర్యాలీలతో వ్యతిరేకించిన స్థానికులు
- స్పందించని స్థానిక ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు

హాస్యాస్పదం

రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా 'మద్యం వద్దు–మాకు భద్రతే ముద్దు' అంటూ టెంట్లలో నిరసనలు చేపడుతున్న మహిళలకు కూటమి నాయకుల ఓదార్పు హాస్యాస్పదంగా కనిపిస్తోంది. నాటి టీడీపీ ప్రభుత్వ హయంలో 2018లో జనావాసాల మధ్య మద్యం దుకాణాలు ఏర్పాటు చేస్తే 'తాటతీస్తా'అన్న అప్పటి ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు నేడు నియోజకవర్గంలో మద్యం దుకాణాలపై జరుగుతున్న నిరసనల పట్ల స్పందించకపోవడంతో మహిళలు కూటమి ప్రభుత్వానికి ఓటు వేసి తప్పు చేశామా అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించాలని స్థానిక మహిళలు కోరుతున్నారు.

కంచరపాలెం: కంచరపాలెం పరిధి ఇందిరానగర్–5 కొండవాలు ప్రాంతం, ధర్మానగర్ మురికివాడ ప్రాంతాల్లో మద్యం దుకాణాల ఏర్పాటుతో మహిళల నిరసన సెగలు వెలువెత్తుతున్నాయి. గుడి, బడి, నివాస ప్రాంతాల వద్ద మద్యం దుకాణాలు ఏర్పాటు చేస్తే స్థానిక కార్పొరేటర్లు, ఎమ్మెల్యేల్లో ఎలాంటి స్పందన లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. 48వ వార్డులోని కంచరపాలెం జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న ఇందిరానగర్–5 గ్రామం వద్ద ఎస్సీఆర్ వైన్స్ పేరుతో మద్యం దుకాణాన్ని ప్రారంభించడానికి ప్రయత్నాలు చేశారు. జనావాసాలు, ఆలయాల దగ్గర నిబంధనలకు విరుద్ధంగా మద్యం దుకాణాలు ఏర్పాటు చేస్తే ఆందోళన చేపడతామని స్థానికులు టెంట్లు వేసి నిరసనలు, ధర్నాలు ప్రారంభించారు. వైన్స్ యాజమాని రాత్రి వేళ దుకాణంలోకి మద్యం బాక్సులు రహస్యంగా దించడంతో పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టడంతో పోలీసులు జోక్యం చేసుకున్నారు. ఆ రోజు నుంచి ప్రతిరోజు మహిళలు నిరసనలు చేస్తున్నారు. 55వ వార్డు కంచరపాలెం ధర్మానగర్ మురికివాడలోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది. ఈ ప్రాంతంలో మహిళలు చేస్తున్న నిరసనలు, ధర్నాలు, ఆందోళనలు, ర్యాలీలకు మంచి స్పందన వస్తోంది.



ఇందిరానగర్–5లో మద్యం దుకాణం వద్ద నిరసన చేపట్టిన మహిళలు



కంచరపాలెం ఇందిరానగర్‌లో టిఫిన్ షాప్‌లోకి మద్యం బాటిళ్లు తరలిస్తున్న వైన్ షాపు యాజమాన్యం.. అడ్డుకుంటున్న స్థానికులు


2018లో కంచరపాలెం ఇందిరానగర్ వద్ద నిరసన చేపట్టిన మహిళలు (ఫైల్)

మద్యం దుకాణంతో ఇబ్బందులు..



బడి–గుడి సమీపంలో మద్యం దుకాణాలు ఏర్పాటు చేయాలని చూడడం బాధాకరం. కుటుంబాలతో జీవనం సాగిస్తున్నాం. మద్యం దుకాణాలు పెడితే మందుబాబుల జోరు ఎక్కువగా ఉంటుంది. వీధుల్లో రాకపోకలు సాగించడం ఇబ్బందిగా మారుతుంది. వైన్ షాప్ యాజమాన్యానికే మద్దతు పలుకున్నారు.

– జి.దుర్గ, ధర్మానగర్, కంచరపాలెం,

ప్రశాంతంగా ఉండలేకపోతున్నాం..



టీడీపీ ప్రభుత్వ హయాంలో ఇదే మద్యం దుకాణాలతో ఇబ్బందులు పడేవారం. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వైన్ షాప్‌లు బడి–గుడి ప్రాంతాలకు దూరంగా ఉండేవి. ఇప్పుడు నిరసనలు, ధర్నాలు చేస్తున్నాం. మద్యం దుకాణాలు ఏర్పాటు చేస్తే ప్రశాంతంగా ఉండలేం.

– కుప్పిలి ప్రసన్న, ధర్మానగర్, కంచరపాలెం.

అధికారులు స్పందించాలి..



ప్రశాంతంగా ఉన్న ప్రాంతాల్లో మద్యం దుకాణాలు ఏర్పాటు చేస్తే పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తాం. ప్రతిరోజు టెంట్లలో చిన్నపిల్లలతో కూర్చుని నిరసనలు, ర్యాలీలు చేస్తున్నాం. టెంట్లలో ధర్నాలు చేసే మహిళలకు కూటమి నాయకులు, కార్యకర్తల ఓదార్పు హాస్యాస్పదంగా ఉంది. సంబంధిత అధికారులు స్పందించాలి.

– అమ్మాజీ, ఇందిరానగర్–5, కంచరపాలెం,

కిడ్నీ బాధితునికి ఆర్థిక సాయం

- రూ.33 వేలు అందజేసిన స్వరాలయ స్టూడియో అధినేత
- దాతల సాయం కోసం బాధితుని ఎదురుచూపు

సీతంపేట: కిడ్నీ బాధితునికి స్వరాలయ స్టూడియో బాసటగా నిలిచింది. విజయనగరం జిల్లా గులువింద పేటకు చెందిన అంపిల్లి లక్ష్మణరావు ఎండాడలోని అపార్టుమెంట్‌లో వాచ్‌మేన్‌గా పని చేస్తూ కుటుంబంతో ఉంటున్నాడు. తరచు అనారోగ్యం బారిన పడుతుండటంతో వైద్య పరీక్షలు చేయించుకోగా కిడ్నీ సంబంధిత వ్యాధి ఉన్నట్టు నిర్ధారణ అయింది. వైద్య పరీక్షల అనంతరం కిడ్నీ పాడైనట్టు నిర్ధారించి, 5వ స్టేజ్‌గా గుర్తించారు. చికిత్సతో నయం కాదని, కిడ్నీ మార్పిడి చేయాలని వైద్యులు సూచించారు. బాధితుని తల్లి బంగారమ్మ కిడ్నీ దానం చేయడానికి ముందుకు వచ్చింది. కిడ్నీ మార్పిడి కోడం సుమారు రూ. 10 లక్షల వరకు ఖర్చు అవుతుందని వైద్యులు చెప్పడంతో, ఏం చేయాలో పాలుపోని స్థితిలో అక్కయ్యపాలెంలోని స్వరాలయ స్టూడియో అధినేత శ్యాంసుందర్ బాధితునికి రూ.33 వేలు నగదు ఆర్థిక సాయంగా అందించారు. దాతలు గొప్ప మనసుతో ముందుకు వచ్చి ఆర్థిక సాయం అందించాలని కిడ్నీ బాధితుడు లక్షణరావు కుటుంబ సభ్యులు కోరుతున్నారు. సాయం చేయదలచిన వారు 86880 52887 ఫోన్ నంబరుకు సంప్రదించాలని తెలిపారు.


కిడ్నీ బాధితునికి నగదు అందజేస్తున్న స్వరాలయ స్టూడియో అధినేత శ్యాంసుందర్

ఘనంగా అంతర్జాతీయ నృత్య దినోత్సవం

సీతమ్మధార: డాక్టర్స్ కాలనీలో ఉన్న నాట్యం నాట్య కళా క్షేత్రంలో అంతర్జాతీయ నృత్య దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. భరతనాట్య కళకు ప్రసిద్ధి చెందిన నాట్యం నాట్య కళా క్షేత్ర అకాడమీ నాట్య గురువులు కె. వెంకట్ చిన్నారావు ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి. నాట్య కళా క్షేత్ర విద్యార్థులు ఈ సందర్భంగా భరతనాట్యంలోని సాంప్రదాయ నృత్యాలు, హస్త ముద్రలు, శ్లోకాలు ప్రదర్శించారు. పుష్పాంజలి, అలరింపు, శ్లోక నాట్యం, కీర్తనం, శబ్దం, తిల్లానా వంటి నృత్యాలను విద్యార్థులు ప్రదర్శించారు. విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ఇందులో రెగ్యులర్ విద్యార్థులతో పాటు ఆన్‌లైన్ ద్వారా నృత్యం అభ్యసిస్తున్న విద్యార్థులు కూడా పాల్గొన్నారు. ఫౌండర్, ప్రెసిడెంట్ అయిన డాక్టర్ కె. మాధవి, నాట్య గురువు వెంకట్ వేడుకలో పాల్గొన్న ప్రతి విద్యార్థిని అభినందించారు. ఈ కార్యక్రమానికి కో– ఆర్డినేటర్‌గా డి. రాజేష్ వ్యవహరించారు. ఈ సంబరాలను సీనియర్ విద్యార్థులు పి. సాయి అక్షిత, వి. కమల స్వేతిక తమ యాంకరింగ్‌తో విజయవంతంగా నిర్వహించారు. గెలిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.


నృత్యం చేస్తున్న విద్యార్థులు

పోలీస్ పోస్ట్.. అదే బెస్ట్..



ట్రాఫిక్ పోలీస్ పోస్టును ఆమె నివాసంగా మార్చేసుకుంది. కంచరపాలెం మెట్టు వద్ద ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన పోస్టు చాలా కాలంగా ఖాళీగా ఉంది. ట్రాఫిక్ సిబ్బంది పోస్టులో ఉండడం లేదు. దీంతో ఒక యచకురాలు ఆ పోస్టును నివాసంగా మార్చుకుంది.

– ఫొటో : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

చక్కగా కథలు చెప్పారు

అల్లిపురం: వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా అల్లిపురం శాఖా గ్రంథాలయంలో విద్యార్థులు చక్కని కథలు వినిపించారు. ముఖ్య అతిథిగా విశ్రాంత రైల్వే ఉగ్యోగి వీఎస్ఎన్ రెడ్డి పాల్గొని విద్యార్థులు చెప్పిన కథలు, వాటి సారాంశాన్ని వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి సెలవుల్లో గ్రంథాలయానికి వచ్చి విజ్ఞానం పెంచుకోవాలన్నారు. గ్రంథాలయంలో రామాయణం, భారతం, భాగవతం వంటి గ్రంథాలే కాక రాజకీయ, సామాజిక రంగాలకు చెందిన కథల పుస్తకాలు, దినపత్రికలు, విజ్ఞానాన్ని అందించే జీకే, చరిత్ర పుస్తకాలు ఉన్నాయన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని గ్రంథాలయ అధికారి పీవీఎస్ రాజు కోరారు.


అల్లిపురం శాఖా గ్రంథాలయంలో కథలు చెబుతున్న విద్యార్థులు

'పవన్ కల్యాణ్ వ్యాఖ్యలు ఖండిస్తున్నాం'

సీతమ్మధార: ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కాంగ్రెస్ పార్టీ నాయకులపై చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామని ఆ పార్టీ నాయకుడు జగన్ మురారి ఒక ప్రకటనలో తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధిష్టానం పహల్గాం దాడిని ఖండించిందని, కేంద్ర ప్రభుత్వం తీసుకునే చర్యలకు పూర్తిగా సహకరిస్తామని ప్రకటించిందని తెలిపారు. ఈ విషయాలు తెలుసుకోకుండా పవన్ కల్యాణ్ వ్యాఖ్యలు చేశారని విమర్శించారు. ఈ దుర్ఘటనను అడ్డు పెట్టుకుని పవన్ కల్యాణ్ రాజకీయం చేయాలనుకుంటున్నారని అన్నారు. ప్రజారాజ్యాన్ని కాంగ్రెస్‌లో విలీనం చేసి కాంగ్రెస్‌లోనే కేంద్ర మంత్రిగా మీ అన్నయ్య చిరంజీవి పని చేశారని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ దేశ స్వాతంత్ర్యం కోసం పని చేసిన పార్టీ అని, స్వాతంత్ర్యం తర్వాత దేశాన్ని పునర్నిర్మించిన పార్టీ అని జగన్ మురారి అన్నారు.

టాస్క్‌ఫోర్స్ అదుపులో గంజాయి నిందితులు

తాటిచెట్లపాలెం: రైల్వేస్టేషన్ మీదుగా గంజాయిని అక్రమంగా రవాణా చేస్తున్న నిందితులను మంగళవారం టాస్క్‌ఫోర్స్, ప్రొహిబిషన్, మద్య నిషేధ స్టేషన్ సిబ్బంది అదుపులోకి తీసుకున్నారు. వారు తెలియజేసిన వివరాలు ఇలా.. విశాఖ రైల్వేస్టేషన్ మీదుగా అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్నారన్న సమాచారంతో జ్ఞానాపురం ప్రవేశ ద్వారం బయట ప్రొహిబిషన్, మద్య నిషేధ ఇన్‌స్పెక్టర్ సిబ్బందితో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి 10 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పరిచినట్లు ప్రొహిబిషన్, మద్య నిషేధ ఇన్‌స్పెక్టర్ బి. నాగవేణి తెలిపారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన


అష్టదళ పద్మారాధనలో సిరులతల్లి

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈవో కె. శోభారాణి, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విజేతగా నిలిచిన వరప్రసాద్ ఎలెవెన్స్ జట్టు

మురళీనగర్: మేడే సందర్భంగా మాధవధార క్రికెట్ క్లబ్ ఆధ్వర్యంలో వెటరన్ క్రికెటర్స్ ట్రోఫీని మంగళవారం నిర్వహించారు. జింక్ గ్రౌండ్‌లో నిర్వహించిన ఫైనల్స్‌లో సనపల వరప్రసాద్ ఎలెవెన్స్ జట్టు విజేతగా నిలిచింది. 10 ఓవర్ల మ్యాచ్‌లో వావిలపల్లి ప్రసాద్ జట్టుపై సనలపల వరప్రసాద్ ఎలెవెన్స్ జట్టు గెలిచింది. మాధవధార క్రికెట్ క్లబ్ పూర్వ అధ్యక్షుడు సనపల సూర్యనారాయణ, సనపల రామ్ గోపాల్ సంయుక్తంగా మ్యాచ్ ప్రారంభించారు. వరప్రసాద్ కెప్టెన్సీలో మొదట బ్యాటింగ్ చేసిన వరప్రసాద్ ఎలెవన్స్ నిర్ణీత 10 ఓవర్లలో 90 పరుగులు సాధించింది. ఆ జట్టు బ్యాటర్ జీవీ ఆనందరావు 20 బంతుల్లో 44 పరుగులు సాధించి అత్యధిక స్కోరర్‌గా నిలిచాడు. అనంతరం బ్యాటింగ్ చేసిన వావిలపల్లి ప్రసాద్ టీమ్ 52 పరుగులు మాత్రమే చేసింది. వరప్రసాద్ ఎవెవెన్స్ జట్టు 38 పరుగుల ఆధిక్యంతో ట్రోఫీ గెలుచుకుంది. వరప్రసాద్ ఎలెవెన్స్ బౌలర్ సనపల నాగచంద్రుడు మూడు వికెట్లు తీశాడు. ఎన్‌టీఎస్ కుమార్, వి. వెంకట్రావు, వి. ప్రసాద్, రమేష్ మ్యాచ్ నిర్వహణకు సహకరించారు. విజేత జట్టుకు మేడే సాయంత్రం మాధవధార సమాజ ఆవరణలో నిర్వహించనున్న కార్యక్రమంలో బహుమతి అందిస్తామని నిర్వాహకులు తెలిపారు.


విజేతగా నిలిచిన సనపల వరప్రసాద్ ఎలెవెన్స్ జట్టు సభ్యులు

ఘనంగా షిర్డీసాయి ధ్యాన మందిరం వార్షికోత్సవం

సీతంపేట: జీవీఎంసీ 26వ వార్డు అక్కయ్యపాలెం రామకృష్ణానగర్‌లో కొలువైన శ్రీ షిర్డీ సాయి ధ్యాన మందిరం 16వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాబాకు పంచామృతాభిషేకం, 1008 లడ్డూలతో సహస్ర నామార్చన, మంత్రపుష్పం, ఆశీర్వచనం, ప్రసాద వితరణ జరిపారు. మధ్యాహ్నం ఆలయం వద్ద భారీ అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. పరిసర ప్రాంత భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రసాదం స్వీకరించారు. సాయంత్రం సామూహిక సాయి సత్య వ్రతం జరిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని వ్రతం ఆచరించారు. బుధవారం సాయంత్రం బాబా వారి శోభాయాత్ర జరుగుతుందని ఆలయ కమిటీ ఛైర్మన్ బొడ్డేటి కిరణ్‌కుమార్ తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని శోభాయాత్రను జయప్రదం చేయాలని కోరారు.


ప్రత్యేక అలంకరణలో అక్కయ్యపాలెం షిర్డీసాయి


సాయి సత్య వ్రతంలో పాల్గొన్న భక్తులు


భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న నిర్వాహకులు

కొట్లాట నేపథ్యంలో ఇద్దరిపై కేసు నమోదు

సీతమ్మధార: సీతంపేటకు చెందిన రౌడీషీటర్ బాబులు (40) తన స్నేహితుడిని తిట్టాడని సోమవారం రాత్రి అదే ప్రాంతానికి చెందిన వినయ్ (23) అనే యువకుడి ఇంటికి వెళ్లి అతనిపై దాడికి పాల్పడటమే కాకుండా కుటుంబ సభ్యులపై దురుసుగా ప్రవర్తించాడు. తర్వాత కొద్ది గంటలకు వినయ్ తన స్నేహితుడితో కలిసి బాబులు ఇంటికి మాట్లాడటానికి వెళ్లడంతో అక్కడి నుంచి తప్పించుకున్నాడు. రౌడీషీటర్ తనకు ఏమీ తెలియనట్టు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశాడు. ఆ తర్వాత వినయ్ కుటుంబ సభ్యులు సైతం తమపై దాడికి దిగినట్లు ఫిర్యాదు చేయగా ఇద్దరిపై కేసు నమోదు చేశారు.

రోడ్లిలా.. ప్రయాణమెలా?


నగర రహదారులు మృత్యుకుహరాలుగా మారుతున్నాయి. కొన్ని చోట్ల గుంతలు ఉంటే.. మరికొన్ని చోట్ల భారీగా మట్టితో కప్పి ఉంటున్నాయి. సంక్రాంతిలోగా గుంతలు లేని రోడ్లు నిర్మిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు బాకాలు ఊదారు. కానీ క్షేత్ర స్థాయిలో రహదారులు అధ్వానంగా ఉన్నాయి. అక్కయ్యపాలెం 80 ఫీట్ రోడ్డు నుంచి కంచరపాలెం మెట్టుకు వెళ్లే రహదారే ఇందుకు నిదర్శనం.

– ఫొటో : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం